ప్రజాశక్తి
సోమవారం 16 అక్టోబర్ 2023
5
పార్వతీపురం మన్యం



డిప్యూటీ సిఎంను కలిసిన ఎస్‌టి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి-సాలూరు

డిప్యూటీ సీఎం రాజన్న దొరను ఆయన నివాసంలో ఆదివారం సాయంత్రం ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు కలిశారు. గత కొద్దిరోజులుగా డివిజి శంకర్రావు ఏజెన్సీ ప్రాంతంలో చురుకుగా పర్యటిస్తూ గిరిజన సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తున్నారు. గిరిజన సంఘాల నుంచి పలు వినతులు స్వీకరించారు.



రాజన్నదొరతో మాట్లాడుతున్న డివిజి శంకరరావు

ఆశావాహుల ఊహాలకు తెరపడేదెప్పుడో?

వైసిపి టిక్కెట్ కోసం రహస్య మంతనాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం నియోజకవర్గంలో వైసిపి టిక్కెట్టు కోసం ఆశావాహులు ఎవరికి వారు లాబీయింగ్ ప్రారంభించారు. నియోజకవర్గంలో ఎంతో బలంగా కనిపిస్తున్న వైసిపి వారికి వారే నాకే టిక్కెట్టు వస్తుందన్న ధీమాతో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగిజోగారావు, రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎస్సీ కమిషన్ సభ్యులు సవరపు జయమణి టిక్కెట్టు మాకే వస్తుందంటూ ఎవరికి వారే ఉధృతంగా ప్రచారం చేయడంతో ఏసారి టికెట్ ఎవరికనే విషయంలో మాత్రం సస్పెన్స్ కొనసాగుతుంది. దీంతో ఇరువర్గాలకు చెందిన కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్కంఠ రేపుంది. ఈనెల 11న వైసిపి అధినేత, సిఎం జగన్‌మోహన్‌రెడ్డితో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జోగారావు పత్యేకంగా కలిసిన ఈసారి టికెట్ నీదేనంటూ, నియోజకవర్గంలో ప్రచారం చేసుకో అన్ని తెలియజేశారని స్వయంగా ఆయనే తెలియజేసినప్పటికీ, ఇందంతా అసత్య ప్రచారమని ప్రసన్నకుమార్ గ్రూపీయులు కొట్టిపారేశారు. దీంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని వైసిపి కార్యకర్తలో ఇదే చర్చ కొనసాగుతుంది. అలజంగి జోగారావుకు టికెట్ ఖాయం చేస్తే పత్రికాముఖంగా ఎందుకు ప్రకటించలేదనే వారి వాదననూ అలజంగి వర్గంలో ఖండించలేని పరిస్థితి ఎదుర్కొంటుంది.

నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంలోగానీ, పార్టీ ఇచ్చిన అన్ని కార్యక్రమాలు శతశాతం విజయవంతం చేయడంలో గానీ, కార్యకర్తలను, నాయకులను, ఏకతాటిపై నడిపిం చడంలోనూ, అంగ, ఆర్థికబలంతో స్థానిక ఎన్నికలలో పార్టీని ఎనలేనిరీతిలో విజయతీరాలకు చేర్చిన ఎమ్మెల్యే జోగారావుకు అధిష్టానం వద్ద మంచి గుర్తింపు ఉంది. అయితే ఐపాక్‌తో పాటే జగన్ జరిపిన అంతర్గత సర్వేలో జోగారావుకు ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని, అందుకే పార్వతీపురం అభ్యర్థిని తప్పక మారుస్తారనే చర్చ జరుగుతోంది. అలాగే రాష్ట్రంలో ఏ కార్పొరేషన్ చైర్మన్ చేయని కృషి చేయడంలోనూ, పార్టీకి చెందిన అధినాయకులను మెప్పించడంలోనూ జమ్మాన ప్రసన్నకుమార్ కృతకృత్యులయ్యారు కనుక గత ఎన్నికల్లో ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం ఈసారి ఆయనకు తప్పకుండా అవకాశం ఇవ్వడానికి నిర్ణయం జరిగిపోయిందని ఆయన గ్రూపునకు చెందిన కార్యకర్తలు ఖరాఖండీగా చెపుతున్నారు. ఇదిలా ఉండగా అలజంగి, జమ్మానల అభ్యర్థిత్వాలను పక్కనపెట్టి ఈసారి మహిళా అభ్యర్థికి అవకాశం ఇవ్వడం ద్వారా పార్వతీపురం నియోజకం వర్గంలో మళ్లీ వైసిపి జండా ఎగురవేయాలని అధిష్టానం ఆలోచనలో ఉంది కనుక, తన పూర్వపు అనుభవాన్ని, పరిపాలనా దక్షతను దృష్టిలో ఉంచుకుని తనకు టికెట్ ఇస్తారంటూ మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి ఉన్నారు. ఈ మేరకు ఆమె భర్త చాప కింద నీరులా నియోజక వర్గంలో ప్రచారం చేసుకుంటున్నారు. పార్వతీపురం టికెట్ విషయంలో తమ ప్రమేయ మేమీ ఉండదని, అంతా జగన్‌మోహన్‌రెడ్డి ఇష్టమని, అభ్యర్థి మార్పు గురించి కూడా తమకేమీ సమాచారంలేదని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు ప్రకటించడంతో ఉత్కంఠకు ఇప్పట్లో తెరపడే సూచనలు కనబడడంలేదు. ఇప్పటికైన జరగుతున్న ప్రచారాల దృష్ట్యా కార్యకర్తలు, అభిమానుల్లో మరింత సందిగ్ధత తొలగించడానికి జిల్లా మంత్రులు, నాయకులు స్పష్టమైన ప్రకటన చేయాలని నియోజకవర్గ వైసిపి శ్రేణులు కోరుతున్నాయి.







యథేచ్ఛగా ఇసుక దోపిడీ

ఫిర్యాదులిచ్చినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని శివరాంపురం నదీ పరివాహక ప్రాంతం నుంచి యథేచ్ఛగా ఇసుక దోపిడీ కొనసాగుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ రవాణా సాగుతున్నప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదు. వాస్తవంగా ఇక్కడ ఇసుక రీచ్ అధికారికంగా లేకపోయినా నిల్వలు అధికంగా వున్నాయి. దీంతో స్థానిక అధికారపార్టీ నాయకుల అండతో వారి అనుచరుల ట్రాక్టర్‌ల్లో ఇసుక రవాణా సాగిస్తున్నారు. శివరాంపురంలో సుమారు 30 ట్రాక్టర్‌లు వున్నాయి. కానీ కేవలం అధికారపార్టీ నాయకుల అండదండలు వున్న వారి ట్రాకర్ల ద్వారా మాత్రమే ఇసుక రవాణా చేస్తున్నారు. ఈవాహనాలలో ఇసుక రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదు చేసినా అధికారులు గాని, ఎస్ఇబి అధికారులు గాని స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. స్థానిక వైసిపి నాయకుడి అండతో ఇసుక తరలిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇతరులెవరైనా ఇసుక రవాణా చేస్తే వారు ఫిర్యాదు చేస్తారు, అధికారులు స్పందించి కేసు నమోదు చేస్తున్నారు. ప్రతిరోజూ 20 ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో అయితే ట్రాక్టర్ ఇసుక 3వేలు, దూర ప్రాంతాలకు అయితే 4వేలకు విక్రయిస్తున్నారు. మండలంలో మిగిలిన ప్రదేశాలలో కూడా ఇదేవిధంగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. నియోజకవర్గంలో పాచిపెంట మండలం మోసూరు ప్రాంతంలో, పట్టణంలోని కాకుల తోట నదీ పరివాహక ప్రాంతం నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా సాగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

పిక్క రాయి,మట్టి పై ఆంక్షలు

ఇసుక దోపిడీని వదిలేసిన ప్రభుత్వం గత కొంతకాలంగా క్వారీల నుంచి కొనుగోలు చేసే పిక్క రాయి, మట్టిపై ఆంక్షలు విధించింది.ఉమ్మడి జిల్లాలో పిక్క రాయి, మట్టి రవాణా పై అదనంగా పన్ను వేస్తోంది. రాఘవేంద్రా కన్ స్ట్రక్షన్ కంపెనీ కి ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడంతో ఆ కంపెనీ ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్వారీల నుండి తెచ్చుకున్న పిక్క రాయి ట్రాక్టర్ పై రూ.1200 అదనంగా టాక్స్ వసూలు చేస్తున్నారు. దీంతో గృహ నిర్మాణ దారులు, కాంట్రాక్టరులపై అదనపు భారం పడుతోంది.

వీరఘట్టం : మండలంలోని పనస నందివాడ గ్రామ సమీపాన నాగావళి నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో ప్రతిరోజు ట్రాక్టర్ల ద్వారా విచ్చల విడిగా తవ్వకాలు జరిపి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగించడం వల్ల అక్రమార్కులు మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారాలు కొనసాగించి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక రవాణా చేయకూడదని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ అధికారులు అక్రమదారులపై కనీసచర్యలు చేపట్టకపోవడంతో ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపి ఇసుకను దోచుకుపోతున్నారు. ఈ విషయమే తహశీల్దార్ సిహెచ్ సత్యానారాయణ వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా ఇసుక అక్రమ రవాణా తమ దృష్టికి వచ్చిందని, ఆ ప్రాంతంలో వీఆర్వోలను కూడా అందుబాటులో ఉంచడంతో పాటు పరిశీలన జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.



శివరాంపురం వద్ద ట్రాక్టర్లతో తరలించుకుపోతున్న ఇసుక



ఇవిఎం గోదాం తనిఖీలు చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎస్‌పి రాధిక

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఇన్‌ఛార్జ్ ఎస్‌పి జిఆర్ రాధిక ఆదివారం తనిఖీ చేశారు. సోమవారం నుంచి సుమారు 20 రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ఇవిఎంల మొదటి దశ తనిఖీలను బెంగుళూరు బిఇఎల్ ఇంజినీర్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, ఇన్ ఛార్జ్ ఎస్‌పి ఆదివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తనిఖీలను చేయనున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు మొదటి దశ ఇవిఎంల తనిఖీలకు ప్రతి రోజూ హాజరు కావాలని ఇప్పటికే సమాచారం అందించారు. ఇవిఎం గోదాముల వద్ద భద్రతను, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 3242 బేలట్ యూనిట్లు, 2559 కంట్రోల్ యూనిట్లు, 3162 వివి పాట్లు కలిపి మొత్తం 8980 కేటాయించినట్లు తెలిపారు. 8 బ్యాలెట్ యూనిట్లు, 2 కంట్రోల్ యూనిట్లు, 17 వివి పాట్‌లు వెరసి 27 తిరిగి పంపించడం జరిగిందన్నారు. ఇవిఎంల తనిఖీలు నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్లు లోపలికి అనుమతించడం జరగదని, ఏర్పాటు చేసిన కౌంటర్లలో విధిగా డిపాజిట్ చేయాలని చెప్పారు. డిజిటల్ చేతి గడియారం, ఎయిడ్ పాడ్స్ అనుమతించరని ఆయన వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై ఎటువంటి సందేహాలున్నా నిపుణుల వద్ద నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి జి.మురళీధర్, తహశీల్దార్ ఎన్.శివన్నారాయన, ఈ సెక్షన్ పర్యవేక్షకులు డి.రవికుమార్, ఉప తహశీల్దార్ టి.వెంకటరమణ, బిజెపి, బీఎస్పీ, టిడిపి, వైసిపి రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

- కోట దుర్గమ్మ గుడిలో గంటల కొద్దీ అమ్మవారి దర్శనం కోసం నిరీక్షణ
- ఏర్పాట్లలో విఫలం
- ఆధిపత్యం కోసం నేతలు ఆరాటం

ప్రజాశక్తి - పాలకొండ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన కోట దుర్గమ్మ దసరా నవరాత్రులు ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి కలశ పూజ నిర్వహించి, రాటవేసి, ఉదయం 8.30గంటల నుంచి అమ్మవారి నిజరూప దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి, శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. పాలకొండతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వచ్చిన వారికి అరకొర సౌకర్లే కల్పించారు. ఎండల్లో గంటల పాటు క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి కనిపించింది. అమ్మవారి దర్శనం కోసం గంటల పాటు ఎదురు చూడాల్సి రావడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. సకాలంలో అమ్మవారి దర్శనం కల్పించడంలో పోలీస్ అధికారులు, దేవాదాయ అధికారాలు విఫలమ య్యారు. కొంతమంది క్యూలైన్లోనే సొమ్మసిల్లిన పరిస్థితి కనిపించింది. డిఎస్‌పి జివి కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి డివివి ప్రసాదరావు, ఆలయ ఎఒ మురళీకృష్ణ ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు

ఆధిపత్యం కోసం నేతల ఆరాటం...

కోట దుర్గమ్మ దసరా నవరాత్రుల ఉత్సవాల్లో అధికార పార్టీ నేతలు ఆధిపత్యం కోసం ఆరాట పడ్డారు. తమ అనుచరులకు అమ్మవారి దర్శనం కల్పించడం కోసం పాకులాడారు. దీంతో సామాన్య భక్తులకు కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి.

వివిఐపిల తాకిడి..

కోట దుర్గమ్మ నిజరూప దర్శనం రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, వైస్ ఎంపిపిలు సూర్యప్రకాష్, వకముడి అనిల్, వైస్ చైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మధరావు, కోట దుర్గ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు దుప్పాడ పాపినాయుడు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలమాంబ ఆలయంలో శరన్నవరాత్రులు


మక్కువ: మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా ఆదివారం ప్రారంభించామని ఇఒ వి.రాధాకృష్ణ తెలిపారు. ముందుగా కలశ స్థాపన, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవాచనం, దీప స్థాపన, రుత్విక్ వరుణ, అగ్ని ప్రతిష్ట కార్యక్రమాలతో ప్రారంభమైందని అన్నారు శరన్నవరాత్రి దసరా మహోత్సవాలను కప్పగంతుల శ్రీనివాస శర్మ చే. హెూమములు కూడా జరిపించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పెద్దలు పాల్గొన్నారు

అంగరంగ వైభవంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

వీరఘట్టం : మండల కేంద్రంలోని ప్రముఖ పంచాంగ కర్త ఎస్వీఎల్ఎన్ శర్మ ఆధ్వర్యంలో ప్రారంభించిన దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా భక్తులకు కనువిందు చేసేలా ఎంతో అట్టాసంగా ప్రారంభమయ్యాయి. వేకువ జాము నుండి యాత్రికుల తాకిడి ఎక్కువ కావడంతో దుర్గమ్మ ఆలయమంతా కిటకిటలాడింది. శర్మయాజి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం మహల్చే పూజలు నిర్వహించి దుర్గమ్మ తల్లికి ప్రత్యేక ప్రార్థనలు గావించారు. అలాగే వచ్చిన యాత్రికులకు ఉచితంగా ప్రసాదం, మజ్జిగ, మంచినీటి సౌకర్యాలు యాజ ఏర్పాటు చేశారు. దసరా సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు అలంకరణ చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నావు. ఎస్సై ఎంవి రమణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



వీరఘట్టంలో విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న దుర్గాదేవి గుడి



అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్ తమ్మినేని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అవతారంలో నవదుర్గ

పార్వతీపురం టౌన్ : దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొదటిరోజు పట్టణంలో సారికివీధిలో ఉన్న భద్రకాళి ఆలయం, పాలకొండ రోడ్డులో ఉన్న దుర్గాదేవి ఆలయం, ఆడబడివీధిలో ఉన్న ఆర్యవైశ్య కన్యకా పరమేశ్వరి దేవాలయం, ప్రధాన రహదారిలో ఉన్న కళింగ వైశ్య కన్యకాపరమేశ్వరి దేవాలయం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న భవానీ మాతా ఆలయం, కొత్తవలస శివారులో ఉన్న నవదుర్గ దేవి ఆలయాల్లో ఘనంగా దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. నవదుర్గ ఆలయంలో ఉన్న దుర్గాదేవిని మొదటి రోజు బాలత్రిపుర సుందరి అవతారంలో భక్తులు అలంకరించి దర్శించుకున్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఊరేగింపుగా వెళ్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మోటార్ యూనియన్ వర్తక సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు , గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

ఆధార్ లేక... ఆసరాకు నోచుకోక

- మతిస్థిమితం లేని వృద్ధురాలి దుస్థితి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించని వైనం
- గుర్తింపు లేకపోవడమే కారణమంటున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శోభలతాదేవి కాలనీలో పాడుబడిన ఓ ఇంట్లో నివాసముంటుంది మతిస్థిమితం లేని పట్లాసింగి గంగమ్మ (65). ఈమెకు నా అంటూ ఎవరూలేని అనాథ. గతంలో ఆమెకు రూ.200 పింఛన్ అందేది. అయితే పెన్షన్‌కు ఆధార్ అనుసంధానం చేయడంతో ఆమె వద్ద ఎటువంటి ఆధారాలు లేక వచ్చే ఆ రూ.200 పింఛను కూడా నేటికి ఎనిమిదేళ్ల నుంచి నిలిపేశారు. అయినప్పటికీ కాగితాలు, బాటిల్లు వేరుకొని ఎవరైనా ఏదైనా ఇస్తే తినేది తప్ప మతిస్థిమితం లేనప్పటికీ ఎవర్నీ ఏమి చేయి చాచీ అడగదు. ప్రస్తుతం ఆమెకు కళ్లు కనిపించడం లేదు. దీంతో బయటకు వెళ్లలేని స్థితిలో నా అనుకునే వారు ఎవరు ఉన్నారో లేదో కూడా ఆమెకు తెలియదు. ఒకవేళ ఉన్న వారు ఈమెను పట్టించుకోవడం లేదు. కళ్లు కనిపించకపోవడంతో ఆమె పరిస్థితి మరింత దుర్భరమైంది. దీంతో ఎవరైనా ఏదో ఇస్తే తింటుంది లేదంటే పస్తువులు ఉంటుంది.

ఏ దిక్కు లేని ఆమెకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో శస్త్ర చికిత్స చేయిస్తే కళ్లు కనిపిస్తాయని ఇరుగుపొరుగు వారు అంటున్నప్పటికీ ఆధార్ కార్డు తెమ్మంటున్నారు. అంతేకాదు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ఇన్సూరెన్స్, హెల్త్, పథకాలే కాదు సంక్షేమ పథకాలు కూడా వర్తించవు. ఆధార్ కార్డు లేకపోయినా పాన్‌కార్డు, ఓటరు కార్డు, బ్యాంకు అకౌంటు, వాటర్ బిల్లు, టెలిఫోన్ బిల్లు, ఎలక్ట్రిసిటీ బిల్లు, బర్త్ సర్టిఫికెట్ వీటిలో ఏదైనా ఉండాలి. ఇవేవీ లేని గంగమ్మ కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలకు అనర్హురాలిగా మిగిలింది. ప్రూఫ్ ఆఫ్ ఐడెంటటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ కాగితాలు లేనిదే తామేమీ చేయలేమని ప్రభుత్వ సిబ్బంది చెబుతున్నారు. తను ఈ దేశ మనిషిని కాదా?' అని ఆమె తరుపున పలువురు అడిగే ప్రశ్నకు జవాబు చెప్పేదెవరు? దీనికి ప్రభుత్వం, ఉన్నతాధికారులే స్పందించి పరిష్కారం చూపాలి. జిల్లా ఉన్నతాధికారులు తనకు ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ కల్పించి సంక్షేమ పథకాలు అందించి ఆదుకొనేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ సంక్షేమానికి నోచుకోని గంగమ్మ

ఏనుగులను తరలించాలని కోరుతూ

నేడు డిఎఫ్ఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలో తిష్ట వేసిన ఏనుగుల గుంపును శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతూ సోమవారం పార్వతీపురంలోని డిఎఫ్ఒ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాకాడ ఇందిర పిలుపునిచ్చారు. ఆదివారం కల్లికోట, దుగ్గి, ఆర్తాం, గుణానపురం, పరశురాంపురం, చంద్రంపేట, మార్కొండ పుట్టి గ్రామాల్లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ ఏనుగులను అడవికి లేదా జూకి తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ తలపెట్టిన ధర్నాకు రావాలని ప్రజలంతా రావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ 2017లో ఒడిశా నుంచి అటవీ ప్రాంతం గుండా జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులు వల్ల 11 మంది చనిపోగా, రూ.4 కోట్ల ఆస్తి, పంట నష్టం జరిగిందన్నారు. ఇలాంటి సందర్భంలో ఏనుగుల వెనకాల అటవీ శాఖ అధికారులు తిరగడమే తప్ప ఫలితం ఏమాత్రం రాని పరిస్థితి ఉందన్నారు. ఏనుగుల సంచారంతో రైతులు పంటలు పండించుకోవడానికి, పొలాలకు వెళ్లడానికి భయభ్రాంతులకు గురవుతున్నార న్నారు. ఇంత జరుగుతున్నా మన పాలకులు పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వెంటనే ఏనుగులను అడవికి లేదా జూకు తరలించి రైతులకు పండించిన పంటలకు భరోసా కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో అనేక విధాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఏనుగులను తరలించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పి నేటికీ ఐదు నెలలైనా ఎక్కడా ఏనుగులను తరలించే విషయంలో అధికారులు ఒక్క మాట ఆడని పరిస్థితి ఉందని తెలిపారు. కావున ఇప్పటికైనా అటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇటు అధికారులు సమన్వయంతో ఏనుగులను అడవికి లేదా జూకి తరలించే వరకు పోరాటం ఆగదని అన్నారు. ఇందులో భాగంగా సోమవారం డిఎఫ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టినట్టు తెలిపారు.ఈ ధర్నాకు పెద్దసంఖ్యలో ఏనుగుల బాధిత గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.



ఆర్తాంలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు



విద్యార్థి మనస్వినిని అభినందిస్తున్న గ్రామస్తులు

మనస్వినికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల ఐక్యరాజ్యసమితి పర్యటనకు వెళ్లి వచ్చిన గుమ్మలక్ష్మీపురం కెజిబివి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కురుపాం మండలం కొండబారిడి గ్రామానికి చెందిన విద్యార్థి సామల మనస్వికి ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామంలో పుట్టి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఎవరికి రానటువంటి అవకాశం మనస్వినికి రావడం గర్వించదగ్గ విషమని, ఐక్యరాజ్యసమితిలో రాష్ట్రానికి సంబంధించిన విద్య, సంక్షేమ పథకాలను వివరిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసి ఇంకా బాగా చదువుకుని ఐఎఎస్, ఐపిఎస్ సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం గిరిజన బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్, గ్రామ సర్పంచ్ లక్కాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కథకు పుట్టినిల్లు ఉత్తరాంధ్ర

వెలుగువైపు కథా సంపుటి ఆవిష్కరణలో గంటేడ

ప్రజాశక్తి-విజయనగరం కోట

కథకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లు అని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ప్రముఖ రచయిత్రి ఇనుగంటి జానకి రచించిన 'వెలుగు వైపు' కథా సంపుటిని ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గౌరునాయుడు తదితరులు ఆవిష్కరించారు. మళ్లీ పురం జగదీష్ పుస్తక సమీక్ష చేశారు. బాలల నాటికలు పుస్తకాన్ని కెవి శేషారావు ఆవిష్కరించగా, వీపు విజయ్ కుమార్ సమీక్షించారు. అనంతరం గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ కథకు తూర్పు దిక్కు ఉత్తరాంధ్ర అని అన్నారు. మిగతా ప్రాంతాలతో పోటీపడి మంచి కథలు రావాలని, నడుస్తున్న జీవితం కథలు వస్తే ఇంకా బాగుంటుందని అన్నారు. ఎ కవి పాయల మురళీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత్రి ఇనుగంటి జానకిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, రచయితలు పిఎస్ శ్రీనివాస్, చీకటి చంద్రిక రాణి, రెడ్డి శంకర్రావు, బాలకృష్ణ, చలం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెలుగువైపు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయితలు



పూజలు నిర్వహిస్తున్న కేంద్ర మాజీ మంత్రి కిషోర్‌చంద్రదేవ్

కురుపాం కోటలో ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని కురుపాం కోట వద్ద కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ దంపతులు ఆదివారం కోటలో ఖడ్గ దుర్గతల్లిని వేదమంత్రాల మంగళ వాయిద్యాలు నడుమ ఆనవాలిక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దసరాకు తొమ్మిది రోజులు ముందు నుంచి నవరాత్రులు జరుగుతాయని ఈ నవరాత్రులు జరిగే సమయంలో కోటలో భక్తులు సౌకర్యార్థం తలుపులు తెరిచి ఉంటాయని, కావున కురుపాం చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు దుర్గ తల్లిని దర్శించుకోవడానికి తండోప తండాలుగా వస్తూ దుర్గ తల్లిని దర్శించుకుంటారు.



ఎన్నికైన ఆపస్ జిల్లా నూతన కార్యవర్గం

ఆపస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని వేదసమాజం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు జాగాన రామునాయుడు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా సాదారు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నాలి చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులుగా ఎస్.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జి.మురళీకృష్ణ, పివిఎస్ చలం, కార్యదర్శులుగా కె.వంశీకృష్ణ, హరిశంకర్, గణపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షులు సాదారు శ్రీనివాసరావు చెప్పారు.

హెచ్‌ఎంకు సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబర మండల పరిషత్ పాఠశాలలో ఇటీవల డిప్యూటేషన్‌పై ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన బి.రామారావుకు ఆదివారం మండల విద్యాశాఖ అధికారులు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ రావును కూడా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముకుందరావు ,హరి నారాయణ, నాగభూషణరావు ,స్వాతి, తదితర పాల్గొన్నారు.



తిరుమలరావును సన్మానిస్తున్న రచనా సమాఖ్య సభ్యులు

తిరుమలరావుకు సత్కారం

ప్రజాశక్తి-పాలకొండ

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, ఒని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న కుదమ తిరుమలరావును బొబ్బిలిలో రచనా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన గురుబ్రహ్మ సంకలనం ఆవిష్కరణ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో ఎంపికైన నూట ఎనిమిది కవితలతో రూపొందిన ఈ గురుబ్రహ్మ సంకలనంలో తిరుమలరావు రచించిన గురుసాక్షాత్ పరబ్రహ్మ అనే కవిత కూడా ఉంది. పుస్తకావిష్కరణ చేసిన ఆదిశేషు ఎస్ కె కె రంగారావు బేబీనాయన, రచనా సమాఖ్య అధ్యక్షులు మింది విజయమోహనరావు, నెల్లిమర్ల ఎంఇఒ ఈషు సూర్యనారాయణ, డాక్టర్ కర్రి సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు ఎలిశెట్టి సురేష్, ప్రముఖ సాహితీవేత్తలు చివుకుల శ్రీలక్ష్మి, ఎస్ఎస్ఎస్ రాజు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, కార్యవర్గసభ్యులు టి.వెంకటరమణలు తిరుమలరావును శాలువా, ప్రశంసా పత్రం, గురుబ్రహ్మ సంకలనం, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కృష్ణరాయపురం జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరిశీలించారు. సీతానగరం అజ్జాడ బిటి రోడ్డు నుండి తమ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి బిటి రహదారి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గునుపూరు అప్పల నాయుడు, వైసిపి సీనియర్ నాయకులు రెడ్డి అప్పల నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, సర్పంచ్ దాసు, వివిధ గ్రామాల సర్పంచ్ ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, ప్రజలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యార్థులకు దసరాసెలవులు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖాగ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడే పలురకాల పుస్తకాలు ఉన్నాయని, వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు చదువుపై ఆసక్తి కలిగించేలా పలుకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడంమాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారని చెప్పారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం, దసరా సెలవులు కావడంతో విద్యార్థులు, పర్యాటకులతో పార్కు పోటెత్తింది జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. యువతీ యువకులు యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. చిన్నారులు కమాండో నెట్ ఆడుకున్నారు. యువతీ యువకులు స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. గైరో ఎక్కి గుండ్రంగా తిరిగారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

గిరిజన గ్రామాల్లో గ్రామదర్శిని

సీతంపేట: మండలంలోని నారాయణ గూడ,చిన కంబ, జొనగ, జోనగ గుడలు, సీది, సామరెల్లి, తుంబ కొండ, దోనుబాయి, పుబ్బడ, కోదుల వీరఘట్టం గుజ్జి తదితర గిరిజన గ్రామాల్లో ఆదివారం మన్య ప్రగతి ఆధ్వర్యంలో గ్రామదర్శిని మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవి గ్రామదర్శిని నిర్వహించారు. గిరిజనులతో మాట్లాడి పలు సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా సమస్యలు, సంస్కృతి - సంప్రదాయాలు, గ్రామాల అభివృద్ధి, మానవ సంబంధాలు పై 'గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమం నిర్వహించారు'. గ్రామ పెద్దలు, మహిళలు, యువత తో కలిసి గిరిజన సంక్షేమ, గిరిజన అభివృద్ధి, గిరిజన సమస్యలపై చర్చించారు . ఈ కార్యక్రమంలో గేదెల రవి, మన్య ప్రగతి చైర్మన మరియు టీం సభ్యులు పాల్గొన్నారు.

న్యాయానికి సంకెళ్లా?

పలుచోట్ల టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు వినూత్న కార్యక్రమం చేపట్టారు. న్యాయానికి సంకెళ్లు పేరిట నిరసనలతో హోరెత్తించారు. చేతికి తాళ్లు, రిబ్బన్లతో సంకెళ్లు వేసుకొని ఆదివారం రాత్రి 7గంటల నుంచి 7.05గంటల వరకు నిరసన తెలిపారు. పార్వతీపురం పట్టణంలో ఐటిడిపి పట్టణ అధ్యక్షులు బార్నాల సీతారాం ఆధ్వర్యాన నిర్వహించారు. అలాగే మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నర్సిపురంలో మాజీ ఎంపిపి గొట్టాపు గౌరీ ఆధ్వర్యంలో సత్యానికి సంకెళ్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు అభిమానులు

సాలూరురూరల్ : మండలంలోని బాగువలసలో టిడిపి నాయకులు చేతికి సంకెళ్లు వేసుకొంటూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆమదాల పరమేష్, మహిళా నాయకులు మత్స సాయి, శ్యామ్, శ్రీను పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని ఎ.వెంకంపేటలో చంద్రబాబు అరెస్ట్ కు నిరసనగా మండల మాజీ టిడిపి అధ్యక్షులు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంకెళ్లు వేసుకుంటూ నిరసన తెలిపారు.

గుమ్మ లక్ష్మీపురం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు కు నిరసనగా న్యాయానికి సంకెళ్లు అనే కార్యక్రమాన్ని గుమ్మలక్ష్మీపురం, జియమ్మ వలస మండలాల్లో నిర్వహించారు. కార్యక్రమం లో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: జిల్లేడుపాడులో చంద్రబాబు అక్రమ అరెస్టుకు సంఘీభావంగా చేతులకు సంకెళ్లు వేసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జయకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, సీతంపేట బీసీ సెల్ అధ్యక్షులు ఆర్ రంగనాథం,ఎస్సి సెల్ అధ్యక్షులు గంట సుధ,ఐటీడీపి హిమరక పవన్,క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, మహాశక్తి ప్రచార కర్త తోయిక సంధ్యా రాణి,పాలక శశికళ, నిమ్మక రోజా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమదాలలో బాబుతో నేను కార్యక్రమంలో

పార్వతీపురంరూరల్: మండలంలోని జమదాలలో సర్పంచ్ రెడ్డి భారతి, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు ఆధ్వర్యంలో బాబుతో నేను అన్న కార్యక్రమం నిర్వహించారు. అలాగే నరిసిపురంలో మాజీ వైస్ఎంపిపి గొట్టాపు గౌరి, నాయకులు వెంకటరమణ సారధ్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి బాబు అక్రమ అరెస్టు గురించి వివరించారు.

పాలకొండ : మండలంలోని కొండాపురంలో బాబు తో నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడును అన్యాయంగా, అక్రమంగా అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన విధానాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, పాలకొండ పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, ఎంపిటిసి సభ్యులు కరణం నారాయణరావు, సర్పంచ్ రాయి రామకృష్ణ, కొండాపురం గ్రామా పెద్దలు, క్లస్టర్ ఇంచార్జ్ లు,యూనిట్ ఇంచార్జ్ లు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం అలమండ గ్రామ పంచాయితీ, చినతోలు మండలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ గురించి గ్రామంలో ప్రతి ఇంటింటికి వెళ్లి టిడిపి నాయకులు వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు, అరుకు పార్లమెంట్ కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు మూడడ్ల సత్యం నాయుడు, వైస్ ఎంపిపి బిడ్డిక నరేష్ , పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్వతీపురం : సంకెళ్లతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు



మక్కువలో సంకెళ్లతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఉరిడిలో...

కురుపాం : మండలంలోని ఉరిడి పంచాయతీలో బాబుతో నేను అనే కార్యక్రమం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి టి.జగదీశ్వరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరిడి, గుంజరాడ, తుమ్మికిమానుగూడ, కోరాడగూడ గిరిజన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడ్ని వైసిపి ప్రభుత్వం చేసిన అక్రమ అరెస్టులు గూర్చి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీకోఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, టిడిపి నాయకులు పోలూరు శ్రీను, యూనిట్ ఇన్చార్జ్ వెంకటేశ్వరరావు, బూత్ ఇన్చార్జులు బి. యువరాజు భగవాన్, తిరుపతి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని గంగన్నదొరవలస బాబుతో నేను అన్న కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరుతూ గ్రామంలో గల రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, సర్పంచ్ తొత్తడి నారాయణమ్మ, నూకరాజు, రామకృష్ణ, వెంకటరమణ, బొర్రాన్న దొర, భాస్కర రావు,లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.



సిరిమాను తరలింపు కార్యక్రమంలో పాల్గొన్న జనం

సిరిమాను చెట్టు తరలింపు

పైడితల్లమ్మ సంబరానికి పకడ్బందీ ఏర్పాట్లు : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-నెల్లిమర్ల, విజయనగరంటౌన్

ఈనెల 30, 31తేదీల్లో జరిగే ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సినిమానోత్సవానికి కావాల్సిన చింత చెట్టును నెల్లిమర్ల మండలం జరజాపుపేట తుమ్మి అప్పారావు కల్లం నుంచి తరలించే కార్యక్రమం ఆదివారం జరిగింది. సిరిమాను చెట్టుకు ముందుగా సంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు , నేతలు చెట్టు నరికే ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భక్త జనం పోటెత్తింది. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్ర శేఖర్ , నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మెన్ కేసలి అప్పారావు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, నెల్లిమర్ల మున్సిపల్ ఉపాధ్యక్షులు సముద్రపు రామారావు, ఆలయ ఇఒ సుధారాణి, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి విస్తృత ఏర్పాట్లు : కోలగట్ల



గొడ్డలితో గాటు వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చెప్పారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకునే విధంగా క్యు లైన్లు ఏర్పాటు చేశామని, విఐపి పాసులు రద్దు చేశామని తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పైడిమాంబ ఆశీస్సులు అందరికీ ఉండాలి

పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు జిల్లా ప్రజలందరికీ ఉండాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. అమ్మవారి పండుగకు ఇతర రాష్ట్రాలనుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

అడవిని తలపిస్తున్న బైపాస్ రోడ్ మొక్కలు

లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిద పాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు వేసి సుందరీకరణ చేసేందుకు 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పాలక వర్గం కౌన్సిల్ సభ్యులు చేపట్టిన పనులు బూడిదలో పోసిన పన్నీరులా పనికి రాకుండాపోయింది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కౌన్సిలర్లు 13వ ఆర్థికసంఘం నిధుల్లో రూ.16.69 లక్షలు ఖర్చు పెట్టేందుకు ప్రతిపాదనలు చేసి కౌన్సిల్ సాధారణ సమావేశం లో ప్రవేశపెట్టారు. ఆ ప్రతిపాదనను అప్పటి ప్రతిపక్ష వైసిపి కౌన్సిల్ సభ్యులు ప్రైవేటు యజమానుల స్థలాల్లో సుందరీకరణ పనులు వద్దని అభివృద్ధిని నోచుకోని పలు వార్డులలో ఖర్చు చేయాలని డిమాండు చేసి వ్యతిరేకించారు. అయినా అధికార పక్ష కౌన్సిల్ సభ్యులు ఏకపక్షంగా బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ సుందరీకరణ పనుల్లో భాగంగా బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రాంతంలో మొక్కలు వేసి ఇనుప కంచెలు పెట్టి మొక్కలకు నీటి సదుపాయం నిమిత్తం బోరు వేసి కొంతకాలం పర్యవేక్షణ చేపట్టారు. ఏమైందో ఏమో గాని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ సుందరీకరణ చేసిన ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో మొక్కలు చెట్లుగా అడ్డగోలుగా పెరిగి అడవిని తలపించేలా తయారయ్యాయి. బైపాస్ రోడ్డులో ప్రయాణం చేస్తున్న పాదచారులు, వాహనచోదకులు ఈ సుందరీకరణ పనులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వాటి నిర్వహణకు సంబంధిత మున్సిపల్ అధికారులు గాలికి వదిలేసి పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా వృథాగా పోయిందని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



బైపాస్ రోడ్డుకు ఇరువైపులా అడవిని తలపిస్తున్న చెట్లు

మోడీ, జగన్ ప్రభుత్వాలు మారడం ఖాయం : కిశోర్

ప్రజాశక్తి - కురుపాం

మరో ఆరు నెలల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరి పోవడం ఖాయమని మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ అభిప్రాయ పడ్డారు. కురుపాం కోటలో ఆదివారం రాత్రి విలేఖర్లుతో మాట్లాడుతూ తెలుగు దేశం అధినేత చంద్రబాబు అరెస్టులో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హస్త ముందని ఆరోపించారు. ప్రధాని, కేంద్ర హోమ్‌మంత్రి ఏ రాష్ట్రానికి వెళ్ళినా అక్కడ తమకు గిట్టనివారిపై ఏదో ఒక రకంగా కక్ష సాధింపు చర్యలకు పురిగొల్పుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్, మోడీల ప్రభుత్వాలు మారడం తథ్యమని అన్నారు. రానున్న ఎన్నికలు భారత ప్రజలకు రెండో స్వాతంత్ర్య సమరమని అన్నారు. ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలపై ప్రజలు రగిలి పోతున్నారని వీరిని సహించే పరిస్థితిలో లేరని అన్నారు. ఇప్పటి వరకు ఈ ప్రభుత్వాలు నాశనం చేసిన వ్యవస్థలను పునరుద్ధరించుకోవడం మన ప్రధాన కర్తవ్యమన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రజలపై ఉందని అన్నారు.

కలాం సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు అన్నారు. మండలంలోని నాగూరులో అబ్దుల్ కలాం పురస్కరించుకుని హై స్కూల్ ప్రాంగణంలో గల కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలాం దేశ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థలో విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి : కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న మధుసూనదరావు

పార్వతీపురంరూరల్ : అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మండలంలోని చినబొండపల్లికి చెందిన యువత ఆదివారం బిసికాలనీలో ఇంటింటా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఉపసర్పంచ్ పైడాన సత్యవతిశ్రీనివాస్ ఆధ్వర్యంలో యువజన సంఘ నాయకులు ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలాంను స్ఫూర్తిగా తీసుకుని, పర్యావరణాన్ని పెంపొందించే మొక్కలు ఇంటింటా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటి ముంగిటా వాటిని నాటించి, వాటిని పరిరక్షించే బాధ్యతనుకూడా చేపడుతున్నట్లు తెలిపారు.

వీరఘట్టం: మండలంలోని అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్లపాడు, గడగమ్మ, తెట్టంగి తదితర గ్రామాల్లో జనసేన నాయకులు అబ్దుల్ కలాం చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎం.పుండరీకం, వజ్రగడ జానీ, జి నరేంద్ర , కే పవన సాయి, డి పవన్, తదితరలు పాల్గొన్నారు.

అందుబాటులో ప్రథమ చికిత్స మందులు

ప్రజాశక్తి - సీతానగరం

అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన సీతానగరం పిహెచ్‌సిని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసరంగా చికిత్సకు అవసరమైన పాము కాటు, కుక్క కాటు,రోడ్డు ప్రమాదాలు తదితర సంఘటనల్లో ఆసుపత్రికి వచ్చిన వారికి ఏ విధమైన చికిత్స అందజేస్తున్నారు, రోజుకు ఎంత మంది నమోదవుతున్నారు రికార్డులో పరిశీలించారు. ఎఎస్‌వి, ఎఆర్‌వి, టిడి తదితర అవసరమైన మందుల లభ్యతను తనిఖీ చేశారు. అలాగే ప్రథమ చికిత్స కార్నర్‌లో వైద్య పరికరాలు, మందులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ఎంత త్వరగా అందిస్తే ప్రాణహాని నుంచి అంతగా తప్పించవచ్చన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారికి దగ్గరగా ఉన్న ఆసుపత్రులకు రోడ్డు ప్రమాదాల సంఘటనలు వల్ల అత్యవసర చికిత్స అవసరమయ్యే వారు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చికిత్స కు ముందు, అందజేస్తున్న సమయంలో పల్స్, బిపి,శ్వాస మొదలగు వైటల్స్ పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అదేవిధంగా మానసిక స్థైర్యాన్ని కలుగజేయాలన్నారు. ఇందులో వైద్య సిబ్బంది నాగమల్లీశ్వరి తదితరులు ఉన్నారు.



మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

నర్సిపురంలో 'హేండ్‌వాష్ డే'

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురంలో వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో గ్లోబల్ హేండ్‌వాష్‌డే కార్యక్రమంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన అగ్నిగంగమ్మ మహిళా సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో చేతుల పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే లాభాలు, అపరిశుభ్ర చేతులతో జరిగే అనార్ధాలు వివరిస్తూ ప్రతిరోజులు చేతులు ఏవిధంగా శుభ్రపర్చుకోవాలనే విషయంపై గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి సత్యంనాయుడు, డిపిఎ ప్రవీణ్‌కుమార్, అప్పారావు, ఎపిఎం పువ్వల సురేష్, బిఎల్ వెంకట్, సిసి చందాపు గంగయ్య, విఒ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు చేతులను శుభ్రపర్చుకొని ఆహారం తీసుకోవాలని డ్వామా పిడి పెద్దింటి కిరణ్ కుమార్ సూచించారు. నేషనల్ గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండవాడ, ఒత్తాడ గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. మూడు పూటలా చేతులను శుభ్రంగా కడుక్కుంటే చేతికి ఉండే క్రిములు తొలగిపోతాయన్నారు. రోజురోజుకు వస్తున్న కొత్త కొత్త వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో వ్యాధులు రాకుండా ఆస్కారం ఉంటుందన్నారు.



గుమ్మలక్ష్మీపురం : హేండ్‌వాస్‌పై అవగాహన కల్పిస్తున్న డిఆర్‌డిఎ పిడి కిరణ్‌కుమార్

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా గిరిజన రైతులు ఎన్నో లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ భూషణరావు అన్నారు. రసాయన ఎరువులు వినియోగంలేని తక్కువ ఆదాయంతో ఎక్కువ దిగుబడి వచ్చే ప్రకృతి వ్యవసాయ పంటలను పండించి ఆర్థికంగా లబ్ధి పొందాలని కోరారు. మండలంలోని చెముడు గూడ పంచాయతీ తాటిశీలలో మహిళా సంఘాలతో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాల చుట్టూ లభించే ఆకులు, కాయలు, ఆవు మూత్రం, చెరువుమట్టిలో ప్రకృతి వ్యవసాయం పంటలకు కావాల్సిన పోషకాలు ఉంటాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పంటలతో జబ్బులను తగ్గించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. వరి, పత్తి పంటలకు కావాల్సిన పొటాష్‌ను జిల్లేడు ఆకులతో ద్రావణం తయారు చేసి, పంటలపై పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు.

నేరాలు ఘోరాలు

బైక్ బోల్తా.. కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని గురువునాయుడుపేట సమీపాన శనివారం బైక్ బోల్తాపడిన ఘటనలో జార్ఖండ్‌కు చెందిన కల్లాస్ భరక్ (34) మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ కృపారావు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలో జరుగుతున్న హరిత రహదారి పనుల నిమిత్తం జార్ఖండ్‌కు చెందిన కల్లాస్ భరక్ వచ్చి ఇక్కడ పనులు చేస్తున్నాడు. శనివారం సాయంత్రం రోడ్డు పనులు ముగించుకొని పనుకువలస గ్రామం నుండి మరి కొంత దూరంలో వారు నిర్మించుకున్న తాత్కాలిక షెడ్లు వద్దకు వెళ్తుండగా గురువునాయుడుపేటకు చెందిన కొరి పల్లి సన్యాసిరావు అటువైపుగా ద్విచక్ర వాహనంపై వస్తు ఉండగా భరక్ లిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డుపై మొక్కజొన్న గింజలు ఆరబెట్టి ఉండడంతో వారివాహనం రహదారిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కలాస్ భరక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సన్యాసిరావుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి తెలిపారు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని చిట్లువీధిలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కూర్మాపు ప్రసాదరావు (ట్యాంక్ బండ్ ప్రసాద్) ఆదివారం తన ఇంటి వద్ద అపస్మారక స్థితిలో వుండడంతో వీధిలో ఉన్న ప్రజలు ఆయన బంధువులకు సమాచారం అందించారు.. ప్రసాదరావు గతంలో కొన్ని కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. భార్యా, పిల్లలకు దూరంగా వుంటున్నారు.